క్లుప్తంగా

బోనం ఎత్తుకున్న చిన్నారులు



బోనాలతో చిన్నారులు

గోదావరిఖనిటౌన్: నగరంలోని నారాయణ పాఠశాలలో శనివారం బోనాల వేడుకలు నిర్వహించారు. చిన్నారులు అమ్మవారికి పూజలు నిర్వహించి సంప్రదాయ దుస్తువులతో బోనాలు ఎత్తుకున్నారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం చైతన్యరావు, ప్రిన్సిపాల్ ఎ.రజినీ, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, అకడమిక్ డీన్ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్స్ సౌభాగ్య, రమాదేవి పాల్గొన్నారు.

గుండారం రిజర్వాయర్ సందర్శన



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్‌తో పాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం తహసీల్దార్ ఆరిఫోద్దిన్, ఆర్‌ఐ గౌతమ్ సందర్శించారు. పాఠశాలలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. రిజర్వాయర్‌ను సింగరేణి సంస్థ ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–2 అధికారులు పరిశీలించారు.

మెడికల్ చెకప్ రద్దు చేయాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు మెడికల్ చెకప్ రద్దు చేయాలని శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 2023 ఆగస్టులో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి కడార సునీల్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ చెకప్‌లు నిర్వహించే యాజమాన్యం, అధికారులకు, హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్‌కు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. నాయకులు రెడ్డపాక లక్ష్మణ్, మహాదేవుని శంకర్, నారాయణ, రాంబాబు, మదర్, సుబ్బరాజు, చంద్రయ్య, శాంతయ్య, పి.శంకర్, శ్రీనివాస్ కనకయ్య, సత్యం, మల్లేశ్, పోశం, రాజు పాల్గొన్నారు.

టార్పాలిన్ కవర్లు పంపిణీ



టార్పాలిన్లు అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలోని బందంపలి ఎస్సీ కాలనీకి చెందిన వారికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సాయం అందించి అండగా నిలిచారు. వర్షాలకు ఇంటిపై కప్పు నుంచి నీళ్లు కురుస్తున్న వారికి టార్పాలిన్ కవర్లతో పాటు బెడ్‌షీట్లు, వంట సామగ్రి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ చేతుల మీదుగా అందించారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్, వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్, సత్యనారాయణ, సంతోష్, జీవన్‌ప్రకాశ్‌రెడ్డి, భూమేశ్, సాబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

డిన్నర్ సెట్, టార్పాలిన్లు అందజేత



టార్పాలిన్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంథని: మున్సిపల్ పరిధిలో వర్షాలకు ఇల్లు కూలిపోయే స్థితిలో ఉన్న వారికి, వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న వారికి శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు టార్పాలిన్ కవర్లు, డిన్నర్ సెట్లు అందజేశారు. చైర్మన్ కావేటి రాజగోపాల్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని కుంట సమ్మక్క, సందీప్, సుధాకర్, లచ్చయ్య, సుగుణకు అందజేసినట్లు సభ్యులు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ తూము రవీందర్, నియోజకవర్గ అధ్యక్షుడు మేడగోని వెంకటేశ్, సభ్యులు పోతరవేన క్రాంతికుమార్, రాపర్తి అఖిల్, బిట్టు, సమ్మయ్య పాల్గొన్నారు.

సండే స్పెషల్

బాలికా భళా

బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న విద్యార్థినులు • ఇటీవల హైదరాబాద్ రీజియన్ కేంద్రియ విద్యాలయం ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో పోటీలు



జ్యోతినగర్: ఆటపై మక్కువ, కోచ్‌లు నేర్పిన మెలకువలతో బాలికలు బ్యాడ్మింటన్‌లో భళా అనిపిస్తున్నారు. హైదరాబాద్ రీజియన్ కేంద్రియ విద్యాలయ సంఘటన్ స్పోర్ట్స్ మీట్–2024 ఆధ్వర్యంలో ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని స్పందన, జ్యోతిక క్లబ్ ఇండోర్ కోర్టుల్లో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ బాలికల పోటీలు ముగిశాయి. రీజియన్‌లోని కేంద్రియ విద్యాలయాలకు చెందిన అండర్–14, 17, 19 విభాగాల్లో పోటీలను ఎన్టీపీసీ రామగుండం కేంద్రియ విద్యాలయం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభన్‌బాబు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన బాలికలను నిర్వాహకులు, అతిథులు అభినందించారు. విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లో..

కోర్టులు బాగున్నాయి



ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని కేంద్రియ విద్యాలయంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ బాగుంది. వర్షాలు కురిసినా వసతి సౌకర్యంతో పాటు బ్యాడ్మింటన్ కోర్టులు బాగున్నాయి.

– శ్రీజ, 12వ తరగతి, కేంద్రియ విద్యాలయం, పికెట్

ఉడెన్ కోర్టు బాగుంది



ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని స్పందన, జ్యోతిక క్లబ్‌లోని ఉడెన్ కోర్టు చాలా బాగుంది. క్రీడలకు మంచి వేదికగా నిలిచింది. బ్యాడ్మింటన్ పోటీల్లో రీజియన్ స్థాయిలో ఎంపికై జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాను.

– ఆదిల్ ఫాజియా, కేంద్రియ విద్యాలయం, గచ్చిబౌలి

జాతీయస్థాయిలో రాణిస్తా



హైదరాబాద్ రీజియన్ స్థాయిలో మంచిగా ఆడుతున్న. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతాను. కేంద్రియ విద్యాలయంలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తారు.

– ఎం.కావ్యశ్రీ, 9వ తరగతి, కేంద్రియ విద్యాలయం, బొల్లారం

స్నేహం పెరుగుతుంది



రీజియన్ స్థాయి పోటీలతో పోటీతత్వంతో పాటు స్నేహం పెరుగుతుంది. 15 విద్యాలయాలకు చెందిన క్రీడాకారులు పరిచయం కావడం ఆనందంగా ఉంది. రీజియన్ స్థాయి పోటీలకు ఆతిథ్యమిచ్చిన ఎన్టీపీసీ సంస్థకు, రామగుండం కేంద్రియ విద్యాలయానికి కృతజ్ఞతలు

– ఏంజిల్ యాదవ్, 9వ తరగతి, కేంద్రియ విద్యాలయం, గచ్చిబౌలి

ఎన్టీపీసీకి కృతజ్ఞతలు



ఎన్టీపీసీ సంస్థ క్రీడలకు సంబంధించిన ఆట స్థలం, వాటి ప్రాక్టీస్ కోసం ఆట వస్తువులు సమకూర్చుతుంది. క్రికెట్, బ్యాడ్మింటన్‌తో పాటు అథ్లెటిక్స్‌కు స్టేడియం, పలు క్రీడలకు మంచి నిలయంగా ఉంది. కేంద్రియ విద్యాలయం రీజియన్ పోటీలకు సహకరించినందులకు సంస్థకు కృతజ్ఞతలు.

– కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు

క్వార్టర్లు తీసుకునేందుకు ముందుకు రాని కార్మికులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం శనివారం నిర్వహించిన స్పెషల్ క్వార్టర్ కౌన్సెలింగ్‌లో కార్మికులు పాల్గొన్నప్పటికీ క్వార్టర్లు తీసుకునేందుకు ఆసక్తి కనబర్చలేదు. రోడ్డు విస్తరణలో భాగంగా క్వార్టర్లు కోల్పోతున్న వారికి వేరే ప్రాంతంలో క్వార్టర్లు కేటాయించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. ఈక్రమంలో మరోసారి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఒక్కరు మాత్రమే క్వార్టర్ తీసుకున్నారు. మిగతా కార్మికులు ఆసక్తి చూపలేదు. కౌన్సెలింగ్‌లో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, రామగుండం తహసీల్దార్ జి.కుమారస్వామి, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లిలో కొనసాగుతున్న పోచమ్మ బోనాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆషాఢమాసం పురస్కరించుకొని శనివారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి బోనమెత్తారు. ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పోచమ్మతల్లికి బోనం సమర్పించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



విశ్రాంత గదిని పరిశీలిస్తున్న కేశోరాం సీవోవో అభయ్, కార్మిక సంఘం నాయకుడు కౌశికహరి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి కోరారు. కేశోరాం కంపెనీకి వచ్చిన కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి అభయ్‌దాదిచ్‌ను శనివారం కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులతో కలిసి కార్మిక సమస్యలపై చర్చించారు. నాయకుల విన్నపం మేరకు కంపెనీలో కార్మికులు పనిచేస్తున్న పనిస్థలాలను పరిశీలించిన అభయ్ స్థానికంగా నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కంపెనీ అధికారులను ఆదేశించారు. విశ్రాంతిగదులు, టాయిలెట్స్ సరిగ్గా లేవని నాయకులు విన్నవించగా స్పందించిన ఆయన ప్రత్యక్షంగా సంబంధిత గదులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు ఇటీవల జరిగిన కాంట్రాక్ట్ కార్మికసంఘం ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కౌశికహరి, ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కేశోరాం ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ పార్థసారథి, కార్మికసంఘం నాయకులు పెరుమాండ్ల రమేశ్, బత్తిని సతీశ్‌గౌడ్, వేల్పుల సంపత్ యాదవ్, పూసాల ప్రసాద్, సాదిక్, కొమురయ్య, శంకర్, స్వామి పాల్గొన్నారు.

పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేద్దామని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టిసారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి సూచించారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో 33 అంశాలు ప్రతిపాదించగా 32 అంశాలను సమావేశం ఆమోదించింది. వినాయకచవితి, బతుకమ్మ పంగుగ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల కోసం చర్యలు తీసుకునేందుకు తీర్మానించారు. మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభ ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్ బదిలీ కాగా ఆయనను సత్కరించారు. కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. పెద్దపల్లి మున్సిపల్‌లో పనిచేసే సిబ్బంది, పారిశుధ్య సిబ్బందికి శనివారం రాగినేడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

జీడీకే–11గని సందర్శన



గనిలోకి వెళ్తున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1పరిధిలోని జీడీకే–11 గనిని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ శనివారం సందర్శించారు. గని కార్యాలయంలో పనిస్థలాల మ్యాప్ పరిశీలించారు. అనంతరం గనిలోకి దిగి పనిస్థలాలను తెలుసుకున్నారు. వన్‌సీమ్ సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. రక్షణ పాటించిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టిసారించాలని సూచించారు. డైరెక్టర్ వెంట జీఎం చింతల శ్రీనివాస్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, కాలరీ మేనేజర్ నెహ్రూ ఉన్నారు.

'కృష్ణవేణి'లో ఆషాఢ బోనం



రామగిరి: మండలంలోని కల్వచర్లలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం ఆషాఢ బోనాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో, పోతురాజు వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్, డైరెక్టర్లు రంజిత్, శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారుల పదోన్నతులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి అధికారుల పదోన్నతులు వెంటనే పూర్తి చేయాలని సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గోదావరిఖని అధికారుల సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల కారణంగా నిలిచిన పదోన్నతులు, పోస్టింగ్‌లు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత, భద్రతకు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని కోరారు. స్టాట్యుటరీ మ్యాన్‌పవర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ప్రమోషన్ పాలసీ ఇతర సమస్యల సాధనకు స్ట్రక్చర్ మీటింగ్ త్వరలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింహులు, వైస్ ప్రెసిడెంట్ పొనుగోటి శ్రీనివాస్ జాయింట్ సెక్రటరీ కిరణ్‌రాజ్, ఆర్జీ–2 అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు మల్లేశ్, డాక్టర్ విష్ణు, పెరుమాల శ్రీనివాస్, అంజయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, గుర్రం రాములు, సంపత్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంతో సింగరేణికి అన్యాయం

గోదావరిఖని: కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారంతో సింగరేణికి భవిష్యత్ లేకుండా చేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండె శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణికి కొత్త బ్లాకులు వస్తే తప్ప మనుగడలేదన్నారు. కాబట్టి రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బొగ్గుబ్లాకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, కార్యకర్తలు ఉన్నారు.

వృత్తివిద్యా కోర్సులకు పరీక్ష



పరీక్షకు హాజరైన మహిళలు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ–2 ఏరియా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తివిద్యా కోర్సులకు శనివారం యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా వివిధ రకాల వృత్తివిద్యా కోర్సుల్లో ఇచ్చిన శిక్షణ వారిని ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. కోఆర్డినేటింగ్ ఆఫీసర్ అండ్ డీవైపీఎం ఎన్ వేణుగోపాల్, ఏఐటీయూసీ ఆర్జీ–2 అసిస్టెంట్ కార్యదర్శి శ్యాంసన్, సింగరేణి సేవాసమితి కోఆర్డినేటర్ శివకుమార్, డీఈవో ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ్ నరేశ్, నాంచారయ్య, దేవారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రామగిరి: సింగరేణి సేవాసమితి ద్వారా వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో నిరుద్యోగ మహిళలకు అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–3 సేవాసమితి అధ్యక్షురాలు ఎస్.అలివేణి అన్నారు. సెంటనరీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం తెలంగాణ ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం, హైదరాబాద్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు నిర్వహించిన పరీక్షలను ఆమె పరిశీలించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన మహిళలకు తెలంగాణ ఖాదీ గ్రామోద్యోగ్ వారిచే సర్టిఫికెట్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ గుర్రం శ్రీహరి, హైదరాబాద్ విభాగం సింగరేణి సేవాసమితి కోఆర్డినేటర్ డీ.ఎస్.శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతినిధి నరేశ్, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, పర్సనల్ విభాగం సిబ్బంది లక్ష్మణ్, రాయమల్లు, సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పట్టణాభివృద్ధికి రూ.8కోట్లు కేటాయించాలి

పెద్దపల్లిరూరల్: పట్టణాభివృద్ధి కోసం రూ.8కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే విజయరమణారావును కోరుతూ తీర్మానం చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, కమిషనర్ ఆకుల వెంకటేశ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. మున్సిపల్‌కు తైబజార్ పన్నుల రూపంలో వసూలు చేసే మొత్తాన్ని నిలిపివేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో పట్టణాభివృద్ధికి నిధుల కొరత ఏర్పడిందని, వాటిని భర్తీ చేసేలా ప్రభుత్వం నుంచి రూ.8కోట్లు కేటాయించి పట్టణాభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని ఎమ్మెల్యేకు మున్సిపల్ తీర్మానం మేరకు విన్నవించాలన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఆసంపల్లి లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య స్పందించి విద్యార్థులకు గొడుగులతో పాటు పెన్నులు, పెన్సిల్లు, ఇతర స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఆసంపల్లి లక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆసంపల్లి శ్రీను, హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, నాయకులు అరికాల సతీశ్, మహ్మద్ ఇబ్రహీం, రమేశ్, కుమార్, కుమార్, మహేందర్, సాగర్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్..

గోదావరిఖనిటౌన్: నగరంలోని విఠల్‌నగర్, సంజయ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్ ఆధ్వర్యంలో శనివారం ఆసంపల్లి లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ ఆసంపల్లి శ్రీనివాస్ ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

ఐడీకార్డులు, బెల్టులు అందజేత

మంథని: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మంథనికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దత్తు, కార్తీక్ 280 మంది విద్యార్థులకు ఐడీకార్డులు, బెల్టులు అందజేశారు.

ముగింపు సభ విజయవంతం చేయండి

కమాన్‌పూర్: కరీంగనర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో 31న జరిగే సమగ్ర కులగణన సాధన యాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు.

అధిక వసూళ్లకు వేదికగా మీసేవా కేంద్రాలు

మంథని: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పట్టణంలోని మీసేవా కేంద్రాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సురేశ్ మౌర్య ఒక ప్రకటనలో కోరారు. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, మీసేవా కేంద్రాలు అధిక వసూళ్లకు వేదికలుగా మారాయని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి మీసేవలో సిటిజన్ చార్టర్ ఏర్పాటు చేసి దోపిడీ అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

మంథని: సోషల్ మీడియాలో ఎలాంటి అనుచిత పోస్టులు పెట్టొద్దని, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని మంథని సీఐ బి.రాజు గౌడ్ అన్నారు. మంథని పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పాలకుర్తిలో ఉచిత వైద్యశిబిరం

పాలకుర్తి: మండల కేంద్రంలో శనివారం మక్కాన్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బసంత్‌నగర్, అంతర్గాం పీహెచ్‌సీల వైద్యులు హరితభవాని, ఉదయ్‌కిరణ్, వారి సిబ్బంది కలిసి మొత్తం 128 మందిని పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్ వైద్యశిబిరాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఎంపీడీవో శశికళ, ఏఎన్‌ఎంలు, ఆశాకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

సుల్తానాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చొరవ తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. శనివారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి రిజర్వేషన్ల అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు మహేందర్ తెలిపారు.

అబ్దుల్‌కలాం వర్ధంతి

మంథని: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

ఎలిగేడు: పంచాయతీ ఉద్యోగ, కార్మికుల హక్కుల సాధనకు 30న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీపీ కార్మికుల జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్ కోరారు. ఎలిగేడు మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడారు.

వర్షానికి కూలిన చెట్టు

సుల్తానాబాద్: పట్టణంలో కురుస్తున్న వర్షానికి గడ్డిమహల్‌లో ఉన్న చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వెంటనే సిబ్బందిని, కాలనీవాసులను పిలిపించి అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు.

వరద నీరు మళ్లింపు

రామగుండం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో లోతట్టు కాలనీలు వరద నీటితో ముంచెత్తాయి. డివిజన్ పరిధిలోని పోచమ్మవాడ, ఇందిరమ్మకాలనీ, మహబూబ్‌సుభానీనగర్, క్రషర్ నగర్, ఒరియాకాలనీ, ఈఎస్‌ఐ కాలనీల్లో వరద నీరు నిలిచింది. స్థానిక మాజీ కార్పొరేటర్ నస్రీన్ బేగం స్పందించి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా జేసీబీని పంపించగా కార్పొరేటర్, స్థానిక నాయకులు మహ్మద్ ఉస్మాన్ షరీఫ్ కందకం తవ్వించి వరద నీటిని మళ్లించారు. జేసీబీతో కందకం తవ్వించగా వరద నీరు నేరుగా సమీపంలోని పెద్ద చెరువులోకి మళ్లించడంతో వరద నీటి సమస్య తాత్కాలికంగా తగ్గింది.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

ఓదెల: మండలంలోని గూడెం గ్రామంలోని రోడ్డు పూర్తిగా బురదమయమైంది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్, మాజీ సర్పంచు ఉష్కమల్ల చంద్రమౌళి, రైతుసమన్వయ సమితి కన్వీనర్ రేగుల సంపత్, నాయకులు కులకాని సతీశ్, తిప్పారపు రాజేందర్, రఘుపతి, ముని, బుడిగె కుమారస్వామి, ఇటిక్యాల ప్రవీణ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

రామగిరి: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దని, ప్రతి పంచాయతీ పరిధిలో నిర్దేశించిన మొక్కలు నాటాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రవీందర్ రాథోడ్ ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని కల్వచర్లలో నాటుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పశువులు మేయకుండా మొక్కల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో బి.శైలజారాణి, ఎవెన్యూ ప్లాంటేషన్ అధికారులు గట్టయ్య, మధుకర్, కోటేశ్, ఇన్‌చార్జి ఏపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్లు అఖిల, సుప్రియ, సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ కొమురయ్య పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శనివారం ఏరియా ఆసుపత్రికి వచ్చిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాతకు ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ వినతిపత్రం అందజేశారు. కార్మికులు, ఉద్యోగులు, వైద్యసిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. టెక్నీషియన్లు లేక రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు మూలకు ఉంటున్నాయని తెలిపారు. అన్ని విభాగాల్లో సరిపడా డాక్టర్లు, నర్సులు లేరని వెంటనే నియమించాలని కోరారు. నాయకులు రంగు శ్రీనివాస్, మాదన మహేశ్, బోగ సతీశ్‌బాబు, దాసరి అనిల్‌కుమార్ ఉన్నారు.

విధుల్లో చేరిక

జూలపల్లి: మండల పంచాయతీ అధికారిగా అనిల్‌రెడ్డి శనివారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన కిరణ్ ముత్తారం మండలానికి బదిలీపై వెళ్లగా ఎలిగేడు మండలంలో ఎంపీవోగా పనిచేసిన అనిల్‌రెడ్డి బదిలీపై వచ్చారు.